నమస్తే తెలంగాణ | శుక్రవారం 17 జనవరి 2025
FRIDAY, JANUARY 17, 2025

# ఊరూరా రేషన్ కార్డుల సర్వే



పెంజర్లలో రేషన్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి



ఆమనగల్లు మున్సిపాలిటీ నవచైతన్యకాలనీలో వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ వసంత

కొత్తూరు, జనవరి 16: రేషన్ కార్డులు ఈ నెల 26 నుంచి అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని కొత్తూరు ఎంపీడీవో అరుంధతి తెలిపారు. మండల పరిధిలోని పెంజర్లలో గురువారం కొత్త రేషన్ కార్డుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 16 నుంచి 25వ తేదీ వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితా కోసం మండలంలోని మొత్తం 12 గ్రామ పంచాయతీల్లో క్షేత్ర స్థాయి పరిశీలన లబ్ధిదారుల జాబితా తయారీ నిర్వహిస్తామన్నారు. అలాగే జనవరి 21 నుంచి 24 వరకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. దీంతో పాటు ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ, 25న అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఆమోదం కోసం పంపిస్తామని వివరించారు. 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**అర్హులైన లబ్ధిదారులను గుర్తించండి**

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీలో రేషన్ కార్డులకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. గురువారం మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో వార్డు అధికారుల సమక్షంలో రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కమిషనర్ వసంత మాట్లాడుతూ వార్డు సర్వేయర్లు తమ వద్ద ఉన్న జాబితాలో అర్హులైన వారిని గుర్తించాలని ఆమె సూచించారు.



## ఘనంగా ఉర్సు
### ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు, జనవరి 16: జహంగీర్ పీర్ దర్గా ఉర్సు గురువారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఊరేగింపుగా వెళ్లి దర్గాలకు చాదర్ సమర్పించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 2 ఎకరాల స్థలంలో బస్టాండ్ ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అజయ్‌నాయక్, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు యాదగిరి, రవికుమార్‌గుప్తా, మిట్టునాయక్, గోపాల్‌నాయక్, లింగంనాయక్ పాల్గొన్నారు.

### యువత చెడు వ్యసనాలకు
## దూరంగా ఉండాలి



యాచారం, జనవరి16: యువత గంజాయి, డ్రగ్స్ తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలో నిర్వహించిన ఎంఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన సీఐ కృష్ణంరాజు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్, పేకాట తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో నిర్వహించే క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాచ్చభాష, బాల్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గణేశ్, జంగారెడ్డి, నాగరాజు, సురేశ్, అచ్చిరెడ్డి, శ్రీశైలం, ఆలంపల్లి నర్సింహ, సంపత్, జంగయ్య క్రీడాకారులు, గ్రామస్తులు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



యాచారం, జనవరి16: మండలంలోని మాల్ గ్రామంలో భారత రాజ్యాంగ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహ ఏర్పాటుకు మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రూ.1.30లక్షల విరాళాన్ని గురువారం నిర్వాహకులకు అందజేశారు. వెల్దండ నుంచి ప్రతిష్ఠించడానికి విగ్రహాలను మాల్ గ్రామానికి తీసుకొచ్చారు. అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, జాహంగీర్, మల్లేశ్, భాస్కర్, లింగం పాల్గొన్నారు.

## సర్వే ప్రారంభం



ఆమనగల్లు, జనవరి 16: ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా పథకంలో భాగంగా గురువారం మండల పరిధిలోని రాంనూంతల గ్రామంలో రోడ్లు, గుట్టలు, సాగుకు పనికిరాని భూములు, లే అవుట్లలను గుర్తించుటకు మండల తహసీల్దార్ లలిత సమక్షంలో సర్వే నిర్వహించారు. సర్వేలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ చెన్నకేశవులు, సర్వేయర్ రవి, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గోడౌన్‌లో భారీ దొంగతనం
### రూ.5.20 లక్షలు అపహరణ

మొయినాబాద్, జనవరి 16 : స్టోరేజ్ గోడౌన్ తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు భారీ దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండల కేంద్రంలోని భరద్వాజ్ కాలనీలో పద్మావతి అసోసియేట్ పేరుతో స్టోరేజ్ గోడౌన్ ఉంది. మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన మందడి వినీత్‌రెడ్డి గోడౌన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం రోజు మాదిరిగానే గోడౌన్ తాళాలు వేసి వెళ్లాడు. గురువారం ఉదయం 8 గంటలకు వచ్చి చూసే సరికి గోడౌన్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గోడౌన్‌లోకి వెళ్లి పరిశీలించగా బిరువా తాళాలు విరగొట్టి కనిపించాయి. అందులో ఉన్న రూ.5.20 లక్షల నగదు కనిపించకపోవడంతో గోడౌన్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా రాత్రి సమయంలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు తాళాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లినట్లుగా కనిపించింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## అనాథ శవానికి అంతిమ సంస్కారాలు

కడ్తాల్, జనవరి 16: మండల కేంద్రంలోని ప్రజా చౌక్ వద్ద గల తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్మించిన గదిలో, కొంత కాలంగా అనాథైన పల్లుగూడెం రాములు (80) నివాసం ఉంటున్నాడు. బుధవారం రాములు ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ అంతిమ సంస్కారాలను నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం కడ్తాల్ గ్రామాధ్యక్షుడు యాదయ్య, నాయకులు శేఖర్, అంజయ్య, జంగయ్య, శ్రీరాములు ఉన్నారు.

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుజాత

మంచాల, జనవరి 16: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందే విధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించాలని మంచాల మండల ప్రత్యేకాధికారి ఎన్ సుజాత అన్నారు. గురువారం మంచాల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో నూతన పథకాలపై నిర్వహించే సర్వేలో లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోవద్దని సూచించారు. అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలశంకర్, డిప్యూటీ తహసీల్దార్ అర్షద్, ఏపీవో వీరాంజనేయులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




జైపాల్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

## జైపాల్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

కడ్తాల్, జనవరి 16: మాజీ కేంద్ర మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఆయన ఘాట్ వద్ద, వివిధ మండలాలకు చెందిన నాయకులతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. నివాళులర్పించిన వారిలో ఆయా మండలాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

## దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్, జనవరి16: తాళాలు వేసిన దేవాలయాలు, ఇండ్లను టార్గెట్ చేసి చోరీకి పాల్పడుతున్న పాత నేరస్తుడిని షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం షాద్‌నగర్ పట్టణంలోని రైతుకాలనీలో మైసమ్మ దేవాలయంలో ఈ నెల 14వ తేదీన తాళాలు పగులగొట్టి చోరీ జరిగింది. ఆలయ పూజారి విఠల్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టగా, నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కొనిరెడ్డి వంశీ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతడిపై షాద్‌నగర్, శంషాబాద్, కడ్తల్, నందిగామ, కొత్తూర్, మహేశ్వరం, జడ్చర్ల, ముసపేట, వెల్దండ, షాబాద్ పోలీస్‌స్టేషన్లలో 24 కేసులు ఉన్నయన్నారు. నేరస్తుడు వంశీపై గతంలో పీడియాక్ట్ కేసు నమోదు అయిందన్నారు. ఇటీవలే జైలునుంచి బయటకు వచ్చిన వంశీ మైసమ్మదేవాలయంలో దొంగతనం చేసినట్లు తెలిపారు. ఇతడి వద్ద నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి, జోహెల్ డెవిస్, సైబరాబాద్ క్రైమ్ డీసీపీ నరసింహ, శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్, రామ్‌కుమార్, క్రైమ్ సీపీ శంశాక్‌రెడ్డి, శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ అవినాష్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్ఐ శరత్‌కుమార్, మోహన్, జాకీర్, రఫీలు కేసును ఛేదించినట్లు తెలిపారు.



## ఎమ్మెల్యే, కమిషనర్‌తో బీజేపీ నేతల వాగ్వాదం
### ప్రొటోకాల్ పాటించలేదని మండిపాటు

చేవెళ్ల రూరల్, జనవరి 16 : శంకర్‌పల్లిలో జరిగిన నీటి సరఫరా అభివృద్ధి పనుల శంకుస్థాపనలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. గురువారం ఎంపీ నిధులతో పనులు ప్రారంభిస్తూ శిలాఫలకంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును చిన్నగా వేశారని, ప్రొటోకాల్ పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌పై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు ప్రారంభించి కాంగ్రెస్ నాయకులు హంగు, ఆర్భాటాలు చేయడం విడ్డూరమన్నారు. ఫ్లెక్సిల్లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఫొటో వేయకపోవడంపై బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్ కన్నా.. బీజేపీ నాయకులు రాములుగౌడ్ ఇదేందని ప్రశ్నించారు.

## హాస్టల్‌లో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



భానుప్రకాశ్ (ఫైల్)

పెద్దఅంబర్‌పేట, జనవరి 16: అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ఓ హాస్టల్‌లో బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా, మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన భానుప్రకాశ్ (19) అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్థానికంగానే శ్రీసాయి బాలాజీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి భానుప్రకాశ్ హాస్టల్ భవనం పెంట్‌హౌస్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం తెల్లవారుజామున హాస్టల్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## భూ వివరాల సేకరణ



హిమాయత్‌నగర్‌లో వ్యవసాయ భూముల వివరాలను సేకరిస్తున్న అధికారులు

మొయినాబాద్, జనవరి16: రైతు భరోసా కోసం అధికారులు భూముల వివరాలను సేకరిస్తున్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్, తోలుకట్టా, నక్కలపల్లి, దేవులపల్లి గ్రామాల రెవెన్యూ పరిధిలో ఉన్న భూముల్లో రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులు వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారా... నిర్మాణాలు నిర్మించారా.. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చారా తదితర వివరాలను సేకరించి గ్రామాలవారీగా నివేదికలను తయారు చేస్తున్నారు. పర్యటించిన వారిలో తహసీల్దార్ గౌతంకుమార్‌తో పాటు వ్యవసాయ అధికారి అనురాధ, సుజిత్‌రెడ్డి, సర్వేయర్ జలజ, ఏఈవోలు కుమార్, సునీల్ ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

యాచారం, జనవరి16: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కొండాపురం దశరథ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు దశరథ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని ఓదార్చి రూ.5000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

**బాల్య మిత్రుడికి ఆర్థికసాయం**

మాడ్గుల : మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లేటి శివ కొంత కాలంగా పక్షవాతం వచ్చి, ఆర్థిక పరిస్థితులతో బాధపడుతున్నాడని విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు 2010 సంవత్సరం మాడ్గుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు మిత్రుడిని కలసి పరామర్శించి, దవాఖానకు ఖర్చుల కోసం రూ.62వేలు ఆర్థికసాయం గురువారం అందజేవారు. కార్యక్రమంలోని శివ మిత్రులు పాల్గొన్నారు.

**కడ్తాల్ :** మండల కేంద్రానికి చెందిన రాములు బుధవారం రాత్రి, మాదారం గ్రామానికి చెందిన పుల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. గురువారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఐదు వేల చొప్పున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు బాలయ్య, యాదయ్య, జంగయ్య, బుచ్చయ్య, సత్యనారాయణ, నర్సింహ, అశోక్, భిక్షపతి, బాబులు, పాండు, శేఖర్ పాల్గొన్నారు.



కడ్తాల్ : బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

## ఎస్సీ వర్గీకరణే లక్ష్యం



మాదిగ జేఏసీ సభను విజయవంతం చేయాలని డప్పులు వాయిస్తున్న నాయకులు

మంచాల, జనవరి 16: ఎస్సీ వర్గీకరణ కోసం లక్ష డప్పులు, వెయ్యి గొంతుల సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా మాదిగ జేఏసీ గౌరవ అధ్యక్షుడు ప్రతాప్ అన్నారు. గురువారం మంచాల మండలం లోయపల్లి గ్రామంలో మాదిగ జేఏసీ సమావేశం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జేఏసీ అధ్యక్షుడు భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న నగరంలో నిర్వహించే మాదిగ జేఏసీ సభను విజయవంతం చేసేందుకు మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ సభ్యులు కృష్ణ, సుధాకర్, బోడకృష్ణ, ఎంఏ స్టాలీన్ పాల్గొన్నారు.



### రాజకీయాలకతీతంగా
## అభివృద్ధి
### చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, జనవరి 16 : రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి బీడీఎల్ చౌరస్తాలో ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి రూ.32.47 కోట్లతో చేపట్టిన నీటి సరఫరా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలో తాగునీటి కొరతను శాశ్వతంగా నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

షాబాద్, జనవరి 16: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కుర్వగూడ గ్రామ మాజీ సర్పంచ్ బుయ్యని సంధ్యమల్లికార్జున్‌గౌడ్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో మూడు రోజులుగా నిర్వహించిన కుర్వగూడ ప్రీమియర్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.25వేల నగదు, మెమెంటో, రెండో బహుమతి రూ.15వేల నగదుతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

## విజేతలకు నగదు అందజేత



మాడ్గుల, జనవరి16: మండల పరిధిలోని నల్లచెరువు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నాలుగు రోజుల పాటు క్రికెట్ పోటీలు నిర్వహించారు. అందులో గెలిచిన జట్లకు ప్రథమ బహుమతి చిత్తరంజన్ టీంకు రూ.10 వేలు నగదు, పాల్గొన్న జట్లకు రూ.7వేలు గ్రామానికి చెందిన వెంకటేశ్ అంజేశారు. క్రీడాకారులకు రూ.11వేల నగదు జగన్ మాదిగ అందజేశారు. రూ.5వేలు నవీన్‌గౌడ్, ధళపతిగౌడ్ సీల్డ్ అందజేశారు. కార్యక్రమంలోని దాతలు కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, దర్శన్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, శివ, కొండల్‌రెడ్డి, నిర్వాహకులు మాజీ వార్డు సభ్యులు జంగయ్య, శేఖర్, అనిల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఏఎస్‌ఐలకు ఎస్‌ఐగా ఉద్యోగోన్నతి



ఉద్యోగోన్నతి పొందిన నిరంజన్, ప్రసాద్‌జీని అభినందిస్తున్న సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్

కడ్తాల్, జనవరి 16: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న నిరంజన్, ప్రసాద్‌జీకు ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. గురువారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, పదోన్నతి పొందిన వారికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, సిబ్బంది దశరథం, రాములు, శ్యాంసన్ పాల్గొన్నారు.

## రైతులకు సంఘం అండగా ఉంటుంది



అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 16 : ఆపదలో ఉన్న రైతులకు బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అండగా ఉంటుందని చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్ అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాముల 2వ వార్డుకు చెందిన రైతు చెట్టి లింగంగౌడ్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుమారుడు చెట్టి కిరణ్‌గౌడ్‌కు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో గురువారం రూ. 25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ మల్లమ్మ, డైరక్టర్ జైపాల్‌రెడ్డి, బాలనర్సమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, యాదిరెడ్డి, రాములు, నాయకులు జంగమయ్యాయాదవ్, మేనేజర్ ఐలేశ్ ఉన్నారు.

## ఆరో రోజూ కొనసాగిన దీక్షలు

చేవెళ్ల రూరల్, జనవరి 16 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాఖాలా భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరో రోజూ కొనసాగాయి. గురువారం దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాఖాలా భూములను అన్యాయంగా ఆక్రమించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీక్షలో లక్ష్మణ్, రవి, శంకర్, బాబు, లక్ష్మణ్, చందర్, గోపి, సోనిబాయి, తులసి, గోమా, మున్నా, శంకరమ్మ, మాణెమ్మ, పి.కవిత, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజు, తండా వాసులు పాల్గొన్నారు.